నేడు, రేపు ఓటరు నమోదు ప్రక్రియ

జిల్లా కలెక్టర్ గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో శని, ఆదివారాల్లో నిర్వహించే ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.గౌతమ్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు లేని.. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఆ దిశగా అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది ఓటు హక్కు ప్రాధాన్యత పేర్కొంటూ.. 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు తప్పనిసరి ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా చొరవ చూపాలన్నారు. ఓటరు నమోదుకు సంబంధించి ప్రత్యేక క్యాంపెయిన్ జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. చిరునామా తదితర సవరణల గురించి రెండు రోజులపాటు స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితా సవరణ గురించి చేసిన షెడ్యూల్‌లో ఈ స్పెషల్ క్యాంపెయిన్ డే నిర్వహిస్తామన్నారు. బూత్ లెవల్ అధికారులు(బీఎల్వోలు) పోలింగ్ కేంద్రాల్లో ముసాయిదా ఓటరు జాబితా సంబంధిత ఫారం(6 – 8)లతో ఈ రెండు రోజుల పాటు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఓటర్ నమోదు, ఒక పోలింగ్ కేంద్రం నుంచి మరో పోలింగ్ కేంద్రానికి మార్పు, సవరణలు ఇతర అభ్యంతరాలపై దరఖాస్తులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ గౌతమ్ కోరారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

జవహర్‌నగర్: 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని జవహర్‌నగర్ కార్పొరేషన్ కమిషనర్ రామలింగం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం, ఆదివారం ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రాలలో బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారని ఓటు నమోదు చేసుకోవాలని, ఓటరు కార్డులో ఏమైనా సవరణలు ఉన్నా సరిచేసుకోవాలని సూచించారు.

24న జాతీయ బాలిక దినోత్సవం

సాక్షి, మేడ్చల్‌జిల్లా: ఈ నెల 24న జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని బేటీ బచావో- బేటీ పడావో పథకంలో భాగంగా ఐదు రోజులు పలు కార్యక్రమాలను నిర్వహిస్తామని జిల్లా సంక్షేమ అధికారి జి.క్రిష్ణ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో వ్యాసరచన, ఉపన్యాస పోటీలు, విజ్ఞాన శాస్త్ర పరిశోధనలు, పిల్లల లింగ నిష్పత్తిపై గ్రామస్థాయిలో మహిళా సభలు, గ్రామ సభలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ నెల 24న జాతీయ బాలిక దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తామని, ఇందులో వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేస్తామని తెలిపారు.

స్కాలర్‌షిప్ దరఖాస్తుల గడువు పొడిగింపు

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో దివ్యాంగ విద్యార్థులకు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 31 వరకు పొడగించినట్లు మహిళా, శిశు, వికలాంగులు, వయోవృద్ధులు సంక్షేమ శాఖ తెలిపింది. అర్హత కలిగిన దివ్యాంగ విద్యార్థులు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా సంక్షేమ అధికారి ఎం.క్రిష్ణారెడ్డి తెలిపారు.

నేడు కిసాన్ మహోత్సవం

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి అగ్రికల్చర్ యూనివర్సిటీ(మల్లారెడ్డి స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ సైన్సెస్)లో రెండు రోజుల పాటు కిసాన్ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు డీన్ రాజారెడ్డి తెలిపారు. శనివారం ఉదయం ప్రారంభోత్సవంలో అంతర్జాతీయ ప్లానెట్ అవార్డు గ్రహీత చింతల వెంకటరెడ్డి, ఐసీఏఆర్ మాజీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, మల్లారెడ్డి యూన్సివర్సిటీ చైర్మన్, ఎమ్మెల్యే మల్లారెడ్డి, యూనివర్సిటీ వీసీ వీఎస్‌కే రెడ్డి పాల్గొంటారని తెలిపారు. అనంతరం ఏరువాక ఫౌండేషన్ వ్యవసాయ వార్షిక అవార్డుల ప్రధానోత్సవం, వ్యవసాయ రంగంపై చర్చా గోష్ఠి తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

గోధుమకుంటలో పద్మజారాణి పర్యటన



కీసర: గోధుమకుంట గ్రామంలో శుక్రవారం డీఆర్‌డీఏ అధికారిణి పద్మజారాణి పర్యటించారు. గ్రామంలో పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీని పరిశీలించి అందులో పెంచుతున్న మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆకిటి మహేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవుషాపూర్‌లో పౌష్టికాహారం పంపిణీ



బాలామృతం, గుడ్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ కావేరిమశ్చేందర్‌రెడ్డి

ఘట్‌కేసర్: అవుషాపూర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని స్థానిక సర్పంచ్ కావేరిమశ్చేందర్‌రెడ్డి శుక్రవారం తనికీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది, కేంద్రంలోని చిన్నారులతో మాట్లాడారు. చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం తల్లులు, గర్భిణులకు బాలామృతం, గుడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సబిత, అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారులు పాల్గొన్నారు.

వ్యక్తిగత విషయాలు షేర్ చేయొద్దు



ఘట్‌కేసర్ పీఎస్ ఆవరణలో
సైబర్ క్రైంపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై అశోక్

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ పీఎస్ ఆవరణలో స్థానిక పుడమి స్కూల్ విద్యార్థులకు సైబర్ క్రైమ్‌పై అడ్మిన్ ఎస్సై అశోక్ శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్ వల్ల కలిగే నష్టాలను వివరించారు. అపరిచిత వ్యక్తులతో వ్యక్తిగత విషయాలు ప్రస్తావించొద్దని, వాట్సాప్, ఇన్‌స్టా, స్నాప్‌చాట్‌లో చాటింగ్ చేయకూడదన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ఇతర పెద్దల సూచనల మేరకు చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

IT మాటేమిటి..?



ఉత్తర తెలంగాణ వైపు ఐటీ విస్తరణకు బీఆర్‌ఎస్ శ్రీకారం



ఐటీ పార్కుకు పునాదిరాయి
వేస్తున్న నాటి మంత్రి కేటీఆర్(ఫైల్)

- కండ్లకోయ సమీపంలో టవర్స్ నిర్మాణానికి శంకుస్థాపన
- స్థలాన్ని చదును చేసి.. ఇటుక కూడా పేర్చకుండా..
- అప్పుడు హడావుడి చేసి.. ఆపై నిర్లక్ష్యంగా వదిలేసి..
- బీఆర్‌ఎస్ ఓటమితో.. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆశలు
- ప్రభుత్వ పెద్దలు స్పందించాలంటున్న ఐటీ నిపుణులు



మేడ్చల్: ఐటీని ఉత్తర తెలంగాణ వైపు విస్తరిస్తామంటూ ఇచ్చిన హామీలో భాగంగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మేడ్చల్ సమీపంలోని కండ్లకోయలో నూతన ఐటీ పార్క్ నిర్మాణానికి సిద్ధం అయ్యింది. స్థలం కేటాయించి.. అప్పటి ఐటీ శాఖమంత్రి కేటీఆర్ గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కండ్లకోయలో ఐటీ టవర్స్ నిర్మాణం కోసం శంకుస్థాపన సైతం చేశారు. ఉత్తర భాగంలో ఐటీ విస్తరణతో వేలమంది ఎంతో మేలు కలుగుతుందని, ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని అప్పటి మంత్రి కేటీఆర్ అన్నారు. అప్పటికే ఆ ప్రాంతంలో ఉన్న మార్కెట్ కమిటీ భవనాలు, గిడ్డంగులను ఆగమేఘాల మీద నేలమట్టం చేసి ఆ ప్రాంతాన్ని చదును చేశారు. శంకుస్థాపన సందర్భంగా హడావుడి చేసి ఆ తర్వాత అప్పటి ప్రభుత్వ పెద్దలు అటువైపు కన్నెత్తి చూడలేదు. అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్నా.. చదును చేసిన స్థలంలో కనీసం ఇటుక కూడా పడలేదు. ఆ తర్వాత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓడిపోయింది. దీంతో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ఐటీ నిపుణులు పెద్దఎత్తున ఆశలు పెట్టుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి ఐటీ టవర్స్ నిర్మాణం పూర్తి చేయాలని వారు కోరుతున్నారు.

ఐటీ మంత్రికి విన్నపాలు..

కండ్లకోయలో పెండింగ్‌లో ఉన్న ఐటీ పార్క్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పూర్తిచేయాలని పలు ఐటీ కంపెనీల ప్రతినిధులు రాష్ట్ర ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబును కోరారు. ఐటీ పార్క్ అసోసియేషన్ సభ్యులు మంత్రి శ్రీధర్ బాబును కలిసి వినతి పత్రాలను అందజేశారు. త్వరగా పూర్తిచేసి ఐటీ టవర్స్‌ను అందుబాటులోకి తేవాలని వారు మంత్రిని కోరారు.

లోకల్ నాయకులు పట్టించుకోవాలి..

మేడ్చల్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యే లేకున్నా.. ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి పట్టించుకోకపోయినా స్థానిక కాంగ్రెస్ నాయకులు ఐటీ పార్క్ కోసం పట్టువదలొద్దని పలువురు సాఫ్ట్‌వేర్ రంగ నిపుణులు కోరుతున్నారు. ఈ విషయాన్ని నియోజకవర్గ నేతలు ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి కండ్లకోయలో ఐటీ పార్క్ ఏర్పాటు చేయించాలని స్థానిక యువత కోరుతున్నారు. మేడ్చల్‌లో ఐటీ పార్క్ ఏర్పాటయితే మేడ్చల్ జిల్లా యువతతో పాటు సమీప జిల్లాలైన సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఈ విషయంపై నేతలు దృష్టి సారించాలని కోరుతున్నారు.

మల్లారెడ్డి ప్రతిపాదించేనా..?

ఎమ్మెల్యే మల్లారెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డికి రాజకీయంగా చాలా వైరం ఉండటంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన ప్రాధాన్యం ఇస్తారా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. మల్లారెడ్డి రాజకీయాలను పక్కనపెట్టి అభివృద్ధి కోసం సీఎంను కలిసి ఐటీ టవర్స్ సాధించాలని మరికొందరు కోరుతున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా..?

గత ప్రభుత్వ హయాంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కండ్లకోయ ఐటీ పార్క్ నూతనంగా ఏర్పడిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలోనైనా ముందడుగులు వేస్తుందా అని పలువురు చర్చించుకుంటున్నారు. మేడ్చల్‌కు కాంగ్రెస్ ఎమ్మెల్యే లేకపోయినా.. సీఎం రేవంత్‌రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్‌లో ఓడిపోయినా మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని మేడ్చల్ సెగ్మెంట్ ఆయనకు రాజకీయంగా పునర్జన్మనిచ్చింది. ఆయన ఎంపీగా పనిచేసినా మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కండ్లకోయ ఐటీ పార్క్ పూర్తి చేస్తారని కాంగ్రెస్ నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయినా నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు అభివృద్ధి పనుల్లో తాము వెనుకడుగు వేయమని నిత్యం సీఎం రేవంత్‌రెడ్డి చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. ప్రజలకు ఉపయోగపడే ప్రాజెక్టులను తమ ప్రభుత్వ హయాంలో పూర్తి చేయిస్తామని హామీ ఇస్తున్నారు.

ఎవరి ప్లాట్లను కబ్జా చేయలేదు

ఘట్‌కేసర్: ప్రతాపసింగారం రెవెన్యూ పరిధి సర్వే నంబర్–315, 316, 317లోని ప్లాట్లను కబ్జా చేశాననే మాటలు అవాస్తవమని ఆ గ్రామానికి చెందిన మలిపెద్ది మధుసూదన్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సర్వేనంబర్ 315లో 4.17 ఎకరాలు, 316లో 1.37 ఎకరాల భూమి వారసత్వంగా వచ్చిందని, వాటికి సంబంధించిన పట్టా బుక్కులు ఉన్నాయన్నారు. 317లోని భూమితో తనకు ఎటువంటి సంబంధం లేదని, అందులోని 90 ప్లాట్లను కబ్జా చేయలేదన్నారు. కొందరు కావాలనే తన ప్రతిష్టను దెబ్బతీయడానికి అవాస్తవ ఆరోపణలు చేస్తున్నారన్నారు. ప్లాట్ల విషయమై న్యాయస్థానం, ట్రిబ్యునల్‌లో తనకు అనుకూల తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. తనపై ఆరోపణలు చేసిన వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటానన్నారు.

క్రీడల్లో సత్తా చాటిన విద్యార్థులు



కీసర: కీసరలోని అంకిరెడ్డిపల్లి మహాత్మాజ్యోతిబా పూలే బీసీ సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థినుల జట్టు ఉట్నూర్‌లో జరిగిన ఇంటర్ సొసైటీ లీగ్‌లో ఆర్చరీ జట్టు చాంపియన్‌షిప్ గెలుచుకుంది. ఈ పోటీల్లో అంకిరెడ్డిపల్లిలోని మహాత్మా జ్యోతిబా పూలె ఉప్పల్, కుత్బుల్లాపూర్ గురుకుల విద్యార్థినులు స్వర్ణ, రజిత, కాంస్య పతకాలు, ప్రశంసా పత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను అంకిరెడ్డిపల్లి గురుకుల ప్రిన్సిపల్ రాజమణి, పీఈటీలు, ఉపాధ్యాయులు అభినందించారు. విద్యతో పాటు ఆటలో రాణించాలని ప్రోత్సహించారు.

విదేశీ విద్యపై విద్యార్థులకు అవగాహన



సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాలలో
జ్యోతి ప్రజ్వలన చేస్తున్న టైలర్ నస్పానమ్

ఘట్‌కేసర్: ప్రపంచ విద్యాధోరణిపై విద్యార్థులకు అవగాహన కల్పించడమే వాల్మీకి ఫారిన్ ఎడ్యుకేషన్ లక్ష్యమని యూఎస్‌ఏ ఒరెగాన్ స్టేట్ యూనివర్సిటీ మార్కెటింగ్ మేనేజర్ టైలర్ నస్పానమ్, సీఈఓ నిరుపమ దాస్ అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ కొండాపూర్ సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాలలో విదేశీ విద్య కెరీర్‌పై వాల్మీకి ఫారిన్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు విదేశీ విద్యకు అవసరమైన సమగ్ర జ్ఞానాన్ని సంయుక్తంగా అందజేస్తామని అన్నారు. వాల్మీకి ఫౌండేషన్ లక్ష మంది విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇచ్చి ప్రముఖ విశ్వవిద్యాలయాలతో భాగస్వామ్యం కల్పించామన్నారు. కార్యక్రమంలో సంస్కృతి విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ మల్లాది రమాకాంత్‌రెడ్డి, ప్రిన్సిపల్ ఉదయ్ కిరణ్, ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ నీలం సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని వినతి



ఘట్‌కేసర్‌లో వినతి అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, నాయకులు

ఘట్‌కేసర్: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని స్థానిక మండల విద్యాధికారి(ఎంఈఓ) కార్యాలయంలో మధ్యాహ్న భోజన కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం వినతి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదు నెలలుగా బిల్లులు చెల్లించడం లేదన్నారు. ప్రభుత్వం కోడి గుడ్డుకు రూ.5 చెల్లిస్తుండగా కిరాణ షాపుల్లో రూ.7కు విక్రయిస్తుండంతో కార్మికులు అప్పుల పాలవుతున్నారన్నారు. ప్రభుత్వ ఉత్తర్వు ప్రకారం వేతనాలు, ఏరియర్స్ చెల్లించాలని, అక్షయపాత్ర వంటి స్వచ్ఛంద సంస్థలకు మధ్యాహ్న భోజనం అప్పగించొద్దని, గుడ్లకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని కోరారు. సీఐటీయూ మండల కార్యదర్శి సబిత, తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ కార్యదర్శులు పుష్ప, శ్రీనివాస్, ఉపాధ్యక్షురాలు ప్రేమలత, భాగ్య, కవిత, జ్యోతి పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ



రేణుకా ఎల్లమ్మ ఆలయ కేలండర్‌ను
ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజేందర్

ఘట్‌కేసర్: పట్టణంలోని బాలాజీనగర్ ఎల్లమ్మ ఆలయం నూతన సంవత్సరం కేలండర్‌ను బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు, హుజూరాబాద్ మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ తన నివాసంలో శుక్రవారం ఆవిష్కరించారు. అలాగే ఎదులాబాద్ జెడ్పీ పాఠశాలలో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి టీపీయూఎస్ కేలండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బలరాంముదిరాజ్, గుండ్ల బాల్‌రాజ్‌ముదిరాజ్, గుండ్ల ఆంజనేయులుగౌడ్, మణిదీప్‌ముదిరాజ్, ఉదయ్ కిరణ్ ముదిరాజ్, మహేందర్‌ముదిరాజ్, భూపతి, వికాస్, టీపీయూఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, ఉప సర్పంచ్ నరేశ్, పీఈటీ తిరుమల్‌రెడ్డి, హెచ్‌ఎం రాములు, కృష్ణకుమారి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న నలుగురిపై కేసు

లారీ, రేషన్ బియ్యం
సీజ్ చేసిన పోలీసులు



కీసర: పేదలకు పంపిణీ చేసిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న లారీని కీసర పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సుమారు 36 టన్నుల రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. ఘటన శుక్రవారం రాత్రి కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కీసర సీఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం షేక్ రాహుఫ్, షేక్‌మతిన్, సయ్యద్‌తురబ్, అమోల్‌వాఘ్ నలుగురు ముఠాగా ఏర్పడి పెద్దమొత్తంలో రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు కీసర ఓఆర్ ఆర్ జంక్షన్ వద్ద కీసర పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని లారీతో పాటు బియ్యం సీజ్ చేశారు. వివిధ ప్రాంతాల్లో ప్రజల నుంచి సేకరించిన బియ్యాన్ని మహారాష్ట్రకు చెందిన వ్యక్తికి అధిక లాభానికి విక్రయించేందుకు లారీలో తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కీసర పోలీసులు తెలిపారు.

సన్మానం



మేడ్చల్‌రూరల్: బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన గుండ్లపోచంపల్లికి చెందిన పటోళ్ల విక్రంరెడ్డిని శనివారం పలువురు నాయకులు సన్మానించారు. మండలంలోని ఎల్లంపేట్ గ్రామానికి చెందిన పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జగన్‌గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, కౌన్సిలర్లు హంసకృష్ణ, మున్సిపల్ అధ్యక్షులు శ్రీనివాస్ ముదిరాజ్, ఆంజనేయులు, నాయకులు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

యువతి అదృశ్యం



లక్ష్మీఅభినయ(ఫైల్)

జవహర్‌నగర్: యువతి అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాప్రా శ్రీనగర్‌కాలనీలో నివసించే సింహాద్రి అప్పలాచారి కుమార్తె లక్ష్మీ అభినయ(22) ఈ నెల 17వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ఆమె ఆచూకీ కోసం కుటుంబసభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చిరునామా మార్పునకు దరఖాస్తు చేసుకోవాలి

బోడుప్పల్: ఓటర్ నమోదులో భాగంగా ఓటర్ కార్డులో చిరునామా మార్పు కోసం ఫారం 8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని బోడుప్పల్ కమిషనర్ జి. వేణుగోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20, 21తేదీల్లో బోడుప్పల్‌లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో బూత్‌స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారన్నారు.

పార్లమెంట్ ఎన్నికలకు యంత్రాంగం సన్నద్ధం

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: ఎన్నికల కమిషన్ సూచనల ప్రకారం మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని, ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు సన్నద్ధమవుతున్నట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఈ విషయంలో ఇప్పటి నుంచే సంబంధిత అధికారులకు సూచనలు చేసినట్లు పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి ఆయన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, ఇతర ముఖ్య ఎన్నికల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో ట్లాడారు. జిల్లావ్యాప్తంగా ఎన్నికలకు సంబంధించి ఫారం–6, 7, 8లను ఈ నెల 22 వరకు పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోస్టల్ బ్యాలెట్ సంబంధించి.. ముందస్తు ప్రణాళిక రూపొందించి సంబంధిత అధికారుల ద్వారా అందజేస్తామన్నారు. ఈ నెల 20, 21 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, ఈఆర్వోలు పాల్గొన్నారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 11కేవీ సత్యనారాయణకాలనీ ఫీడర్, 11కేవీ సాయిబాబా టెంపుల్ కాలనీ ఫీడర్ మరమ్మతులతో పాటు ట్రీకట్టింగ్ నేపథ్యంలో శనివారం పలు కాలనీల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని నాగారం విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ కామేశ్వర్‌రావు తెలిపారు. సాయిసంజీవ ఎన్‌క్లేవ్, మాదిరెడ్డి మల్లారెడ్డినగర్, రవీందర్‌నగర్, గోపికృష్ణకాలనీ, సాయిసంజీవనగర్‌కాలనీ, సాయి దుర్గానగర్, అరవింద్‌నగర్, మనీఎన్‌క్లేవ్, ఎస్‌ఎల్‌ఎన్ కాలనీ, త్రివేణి ఎన్‌క్లేవ్, జీఎస్‌ఆర్ గార్డెన్, హనుమాన్‌నగర్, రాంపల్లి ఎక్స్‌రోడ్డు, ఈస్ట్‌గాంధీనగర్ కాలనీలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయిబాబాకాలనీ, ఈస్ట్‌గాంధీనగర్ కాలనీ, ప్రశాంత్‌నగర్, సాయిధరణికాలనీ, రాజ్‌సుఖ్ నగర్, సాయిమహిమకాలనీ, నేతాజీనగర్, హనుమకొండకాలనీ, ఈస్ట్‌హనుమాన్‌నగర్, గౌరిఎన్‌క్లేవ్ తదితర కాలనీలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు.

పలు ఫీడర్ల పరిధిలో..

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ 11కేవీ శివారెడ్డిగూడ ఫీడర్, అంకుషాపూర్ 33/11 కేవీ సబ్‌స్టేషన్ 11కేవీ ఎన్‌ఎఫ్‌సీనగర్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు శనివారం అంతరాయం కలుగుతుందని ఏఈ సతీశ్ కుమార్ పేర్కొన్నారు. శివారెడ్డిగూడ పరిధిలో మారుతీనగర్, మైసమ్మగుట్ట, శివారెడ్డిగూడ, ఘనాపూర్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే ఎన్‌ఎఫ్‌సీనగర్, బొక్కొనిగూడ, పీఎస్, తహసీల్దార్ కార్యాలయం, మేధా కాలనీ, వరంగల్ జాతీయ రహదారిపై మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

రాంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో....

కీసర: రాంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని ఆర్‌ఎల్‌నగర్ 11కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఆర్‌ఎల్‌నగర్, భరత్‌నగర్, గణేష్‌నగర్, షిరిడీసాయినగర్, వాజ్‌పెయ్‌రోడ్డు, సంతోష్‌నగర్‌కాలనీ, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఆర్టీసీ కాలనీ, రిక్వెల్డ్‌ఫోర్డ్ స్కూల్ ఏరియా, మధురానగర్, కృష్ణారెడ్డినగర్, శ్రీనివాసనగర్, ఎలిఫెంట్‌కాలనీ, ఓయూకాలనీ, టీపీఎస్‌కాలనీ, పుష్పటౌన్‌షిప్, ప్రజయిసాయిగార్డెన్ కాలనీల్లో కరెంటు సరఫరాలో అంతరాయం ఉంటుందని కీసర విద్యుత్ ఏఈ మురళీకృష్ణ తెలిపారు.

ఆ పిల్లలు చదువుకు దూరం

- వివిధ కారణాలతో బడిమానేసిన వైనం
- బడి బయట 307 మంది పిల్లలు
- సర్వేలో గుర్తించిన జిల్లా విద్యాశాఖ
- బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా..
- సమీప బడుల్లో చేర్పించిన అధికారులు



సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో బడి బయట పిల్లలు 307 మంది ఉన్నట్లు విద్యాశాఖ గుర్తించింది. వీరందర్నీ సమీప పాఠశాలల్లో చేర్పించడం ద్వారా.. మళ్లీ చదువుకునేలా చర్యలు తీసుకుంది. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన లక్ష్యంగా ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ గత నెల 11 నుంచి ఈ నెల 10 వరకు బడిబయట పిల్లలను గుర్తించేందుకు సర్వే కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సర్వే కార్యక్రమాన్ని సీఆర్పీలు, ఐఈఆర్పీలు చేపట్టారు. ప్రతి సంవత్సరం బడి బయట ఉన్న 6 నుంచి 14 సంవత్సరాల మధ్య ఉన్నవారిని సర్వేలో భాగంగా గుర్తిస్తున్నారు.

మేడ్చల్ జిల్లాలో 516 బడులు..

శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలో 516 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఆర్థిక పరిస్థితులు తదితర పలు కారణాల నేపథ్యంలో కొందరు చదువులకు దూరంగా ఉంటున్నారు. మరి కొందరు తల్లిదండ్రులకు ఆసరా కోసం మధ్యలోనే చదువులను మానేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలు అందుబాటులో లేకపోవడంతో పాటు సమీపంలో ఉన్న ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు చెల్లించలేక బడులకు దూరమవుతున్నారు. గ్రామ పంచాయతీ, పురపాలక సంఘాలు, బస్తీల పరిధిలో జిల్లా విద్యాశాఖకు చెందిన ఐఈఆర్పీలు, సీఆర్పీలు క్షేత్రస్థాయి సర్వే నిర్వహించారు. ఆర్థిక ఇబ్బందులతో చాలామంది బడి మానేసి పనులకు వెళ్తున్న పిల్లలు ఉన్నారు. సర్వే నామమాత్రంగా కాకుండా పకడ్బందీగా నిర్వహిస్తే.. బడి బయట ఉన్న పిల్లల సంఖ్య పెరిగే అవకాశం ఉండేదని పలువురు పేర్కొంటున్నారు.

బడి బయట పిల్లలు ఇలా..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఈ విద్యా సంవత్సరంలో బడి బయట ఉన్న పిల్లలు 307 మంది ఉన్నట్లు గుర్తించారు. వీరంతా 6 నుంచి 14 ఏళ్ల ఉన్నారు. అలాగే.., 2021–22 సంవత్సరంలో 247 మంది పిల్లలు బడి బయట ఉండగా, ఇందులో 6–14 ఏళ్లలోపు 238 మంది పిల్లలు, 14–19 ఏళ్లలోపు 09 మంది ఉన్నారు. 2020–21లో నిర్వహించిన సర్వేలో జిల్లాలో 294 మంది బడి బయట ఉండగా, ఇందులో 6–14 ఏళ్లలోపు 254 మంది పిల్లలు, 15–19 ఏళ్లలోపు 40 మంది ఉన్నారు. వీరందరికీ సమీప పాఠశాలలు, లేదా సార్వత్రిక విద్యాలయాల్లో ప్రవేశాలు కల్పించి చదువుకునేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు.

సర్వే పకడ్బందీగా చేశాం..

ప్రభుత్వ ఆదేశాల మేరకు బడి బయట ఉన్న పిల్లలతో పాటు మధ్యలో బడి మానేసిన పిల్లల గుర్తింపునకు సర్వే నిర్వహించాం. గుర్తించిన పిల్లలందర్నీ సమీప బడుల్లో చేర్పించాం. బడీడు పిల్లలందరూ.. బడుల్లో ఉండాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నాం.

– ఐ.విజయకుమారి,
జిల్లా విద్యాశాఖ అధికారి.